క్లుప్తంగా

28న వైద్యశిబిరం

వేములవాడ: అశ్విని హాస్పిటల్ ఎల్లారెడ్డిపేట, మాతృశ్రీ హాస్పిటల్ వేములవాడ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 28న హన్మాజీపేటలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చీకోటి సంతోష్‌కుమార్, కొలిపాక నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు



వేములవాడలో సీపీఐ జెండా ఆవిష్కరణ

వేములవాడఅర్బన్: పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అమర వీరుల స్తూపం నుంచి గుమ్మి పుల్లయ్య స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, పట్టణ కార్యదర్శి దేవరాజు, పోచమల్లు, అనసూర్య, మల్లేశం, రవీందర్ తదితరులున్నారు.

ఇంటింటి సర్వే



సర్వే నిర్వహిస్తున్న విద్యార్థినులు

తంగళ్లపల్లి: 7 రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా లక్ష్మీపూర్‌లో టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ఆదివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటా తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలు, విద్యాస్థాయి, జీవనోపాధి, ఆరోగ్య పరిస్థితులు, ప్రభుత్వ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ.. ఇలాంటి సర్వేతో విద్యార్థినుల్లో సామాజిక బాధ్యత పెంపొందుతుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిరాణ దుకాణాలు తనిఖీ



కిరాణ దుకాణం తనిఖీ చేస్తున్న ఎస్సై లక్ష్మణ్

వీర్నపల్లి: కంచర్ల గ్రామంలో పలు కిరాణ దుకాణాలను ఆదివారం తనిఖీ చేసినట్లు ఎస్సై వేముల లక్ష్మణ్ తెలిపారు. ఇటీవల గ్రామాల్లో గంజాయి అమ్ముతున్నట్లు దృష్టికి వచ్చినందున తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు.

శ్రమదానం



ఎల్లారెడ్డిపేట: అక్కపల్లి గ్రామస్తులు చేయిచేయి కలిపి శ్రమదానంతోపాటు బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో ఆదివారం ప్రధాన రహదారిపై గుంతలను పూడ్చివేశారు. ప్రయాణానికి ఇబ్బందులు పడుతూ నిత్యం కష్టాలు పడుతున్న వారు.. సమస్య పరిష్కారానికి నడుం బిగించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. మండల కేంద్రం శివారులో ఉన్న రాపెల్లి వాగు దగ్గర ఎల్లారెడ్డిపేట–వీర్నపల్లి ప్రధాన రహదారిపై గుంతలను అక్కపల్లి గ్రామస్తులు మట్టి పోసి పూడ్చివేశారు.

విద్య, వైద్యంపై చిన్నచూపు



మాట్లాడుతున్న శ్రీధర్

వేములవాడ: ప్రజాప్రభుత్వం అని చెప్పుకుంటూ అధికారంలోకి వచ్చి 20 మాసాలు కావస్తున్నా.. నేటికీ విద్య, వైద్యం పట్టించుకోవడం లేదని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని పద్మశాలీ సంఘ భవనంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ యువ మోర్చా రాష్ట్ర నాయకుడు రేగుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. నాయకులు హన్మండ్లు, సంతోష్, మహేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ధీమా.. కిసాన్ మాన్‌ధన్ యోజన

- 18 నుంచి 40 ఏళ్ల లోపు వారికి అవకాశం
- 60 ఏళ్లు నిండిన తర్వాత ప్రతి నెలా రూ.3వేల చెల్లింపు



పొలంలో గొర్రు(ఫైల్)

చందుర్తి: చిన్న, సన్నకారు రైతులకు వృద్ధాప్యంలో ధీమాను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కిసాన్ మాన్‌ధన్ యోజన పథకాన్ని 2019 నుంచి అమలు చేస్తోంది. దీనిద్వారా 60 ఏళ్లు నిండిన చిన్న, సన్నకారు రైతులకు ప్రతి నెలా రూ.3వేల చొప్పున జీవిత కాలం పింఛన్ అందుతుంది. వృద్ధాప్యంలో రైతులకు ఆసరా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకానికి 18 నుంచి 40 ఏళ్ల వయసున్న చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులు. ఆదాయ పన్ను, ఆర్థిక స్థితి, సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్నా వర్తించదు.

వయసును బట్టి..

ఈ పథకంలో రైతులు వాటాధనాన్ని చెల్లించేందుకు వయసును బట్టి చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. 18 ఏళ్ల వారు ప్రతి నెలా రూ.55, 19 రూ.58, 20 రూ.61, 21 రూ.64, 22 రూ.68, 23 రూ.72, 24 రూ.76, 25 రూ.80, 26 రూ.85, 27 రూ.90, 28 రూ.95, 29 రూ.100, 30 రూ.106, 31 రూ.110, 32 రూ.120, 33 రూ.130, 34 రూ.140, 35 రూ.150, 36 రూ.160, 37 రూ.170, 38 రూ.180, 39 రూ.190, 40 ఏళ్లు నిండిన వారు రూ.200 వాటాధన సొమ్మును చెల్లించాలని నిర్ణయించింది. వాటాదారుడు చెల్లించే అంతే మొత్తాన్ని ప్రభుత్వం వాటాధనంగా చెల్లిస్తోంది.

ముందుకు రాని రైతులు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంపై ఆశించిన స్థాయిలో ప్రచారం లేక రైతులు ముందుకు రావడం లేదని ప్రచారం జరుగుతోంది. ఆరేళ్ల కాలంగా ఈ పథకం అమలులో ఉంది. 60 ఏళ్లు నిండిన తర్వాత లబ్ధిదారుడు మృతిచెందితే జీవిత భాగస్వామికి ప్రతి నెలా రూ.1,500 చెల్లిస్తారు.

నమోదు చేసుకోవడమిలా..

ఈ పథకంలో చేరడానికి అర్హత కలిగిన రైతులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్(మీసేవ) కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నోడల్ అధికారులను సంప్రదించాలి. లేకుంటే అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు. నమోదు సమయంలో భాగస్వామి పేరు, పుట్టిన తేదీ, బ్యాంకు ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, సెల్ నంబర్, ఆధార్ కార్డు అప్‌లోడ్ చేయాలి.

అవగాహన లేదు



కేంద్ర ప్రభుత్వం పేద రైతుల కోసం అమలు చేస్తున్న ఈ పథకంపై పూర్తిస్థాయి అవగాహన లేదు. చాలామంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన లేక వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రతీ పథకాన్ని గ్రామ పంచాయతీ, రైతు వేదికల వద్ద నోటీసు బోర్డులపై అంటించి ప్రచారం చేపట్టాలి.

– న్యాత దినాకర్, చిన్న, సన్నకారు రైతు, బండపల్లి

ప్రచారం చేయాలి



కేంద్ర ప్రభుత్వం చేపట్టే పథకాలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. రైతుల ప్రయోజనాల కోసం చేపట్టే ప్రతీ పథకం పేద, చిన్న, సన్నకారు రైతులకు చేరేలా వ్యవసాయాధికారులకు బాధ్యతలు అప్పగించాలి. పంటల నమోదు సమయంలోనైనా రైతు ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పథకాలపై వివరించాలి.

– సిరం తిరుపతి, మాజీ ఉప సర్పంచ్, చందుర్తి



సిరిసిల్లలో ఆర్అండ్‌బీ అతిథి గృహ శిలాఫలకం



తంగళ్లపల్లిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన శిలాఫలకం

శిలాఫలకాలకే పరిమితం

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని కూల్చివేసి ఆ స్థలంలో 4–సూట్ ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణాన్ని చేపట్టేందుకు గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కేటీఆర్ రూ.220లక్షల అంచనా వ్యయంతో 2021లో శంకుస్థాపన చేశారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో రూ.50లక్షల అంచనా వ్యయంతో అప్పటి మంత్రి కేటీఆర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి 2022లో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో అవి కాస్తా శిలాఫలకానికే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని నిర్మాణాలను చేపట్టాలని స్థానికులు, పట్టణవాసులు కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

గంభీరావుపేట: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈనెల 16న మాదిగల జిల్లా ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేదిక నాయకులు కత్తెర దేవదాస్, అంకని భాను, లక్ష్మీనాయాన, వెంకట్రాములు కోరారు. గంభీరావుపేట మండల కేంద్రంలో ఆదివారం సమ్మేళనానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు ఎర్రొల్ల శంకర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బరుకుటం తిరుపతి, నాయకులు నరేశ్‌వర్మ, ఇరిగి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సుద్దాలలో పరామర్శిస్తున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట: సుద్దాల గ్రామానికి చెందిన అలువాల దేవయ్య, పల్లి పెద్ద భూమయ్య, బోయినిపెల్లి మధుసూదన్‌రావు, కుంటెల్లి రామస్వామి, ఎరవెల్లి అమూల్య ఇటీవల మృతిచెందగా.. వారి కుటుంబాలను విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి, నాయకులు సత్యం, గంగయ్య, బాల్‌రెడ్డి, రుక్మిణి, విజయ్, మహేశ్, రమేశ్, సంజీవ్ తదితరులున్నారు.

కొన్ని రోజుల క్రితం తొంటి ఎముక ఆపరేషన్ చేసుకొని విశ్రాంతి పొందుతున్న పల్లిమక్త గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నందగిరి భూమేశ్‌ను మండల నాయకులు పరామర్శించారు. మల్యాల దేవయ్య, తిరుపతి, జిన్న అనిల్, కెందే గంగాధర్, ఆరె మహేందర్, గోపు పరశురాములు, ఎనుగంటి కిషన్, చింతకుంట అనిల్, నందగిరి రఘు, ముత్యం అంజయ్య, ఎనగంటి ఆనందం, వంగల శ్రీనివాస్ తదితరులున్నారు.

బోరు మోటార్ ప్రారంభం



ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం బోరు మోటార్‌ను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సాబేరబేగం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. వారం క్రితం ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తనిఖీ చేసిన సమయంలో సమస్యలు గుర్తించి, పరిష్కరిస్తున్నారన్నారు. అసంపూర్తిగా వదిలేసిన తరగతి గదుల పనులు వెంటనే ప్రారంభించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు తాగునీటి వసతి లేదని హెచ్ఎం దేవరాజు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. వెంటనే రూ.లక్షతో మోటార్‌ను అందించినట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యమ్మ, కార్యదర్శి జాఫర్, వీపీవో సత్తయ్య, నాయకులు షేక్ గౌస్, నిమ్మ మహేందర్‌రెడ్డి, మహేందర్, నిమ్మ నారాయణరెడ్డి, దొమ్మాటి రాజు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



హిందూవాహిని సభ్యులు

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని హిందూవాహిని కమిటీ అధ్యక్షుడిగా నాగసముద్రాల బాలకృష్ణను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని అన్ని యువజన సంఘాల కమిటీ సభ్యులు సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా మామిడి సంజీవ్, కూనబోయిన బాలరాజు, కోహెడ భాస్కర్, వెంకటరెడ్డి ఎన్నికయ్యారు.

బోయినపల్లి: విలాసాగర్ గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా దయ్యాల కొమురయ్య, వైస్ చైర్మన్లుగా ఏనుగుల ప్రశాంత్ కుమార్, సుంకపాక విక్రమ్ బాబు, ప్రధాన కార్యదర్శిగా గోట్ల భూమయ్య, గోనెపెల్లి శేఖర్‌గౌడ్, బూర నరహరి, కోశాధికారిగా బొంతల సుధీర్, సంయుక్త కార్యదర్శిగా దోమకొండ కిరణ్, పైండ్ల చందు ఎన్నికయ్యారు.

గంభీరావుపేట: మండల మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింత వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా సంజీవ్, కోశాధికారిగా కోటగిరి రాజే ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ప్రభాకర్ వ్యవహరించారు.

'తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి తరలిరండి'

ఎల్లారెడ్డిపేట: పెన్షన్ పెంచడంతోపాటు కొత్తవి మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 15న చేపట్టే తహసీల్దార్ ఆఫీస్ ముట్టడికి పెన్షన్‌దారులు హాజరు కావాలని జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ కోరారు. వెంకటాపూర్‌లో ఆదివారం పెన్షన్‌దారులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పెన్షన్ రూ.4వేలు, వికలాంగుల పింఛన్ రూ.6వేలు పెంచాలని కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు గడుస్తున్నా కొత్త వారికి పెన్షన్ మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు శోభారాణి, అందె సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఇంటిపైకి దూసుకొచ్చిన కారు

కోనరావుపేట: ఎగ్లాస్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ నామ రామారావు ఇంటిపైకి కారు దూసుకొచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామారావు దంపతులు ఇంటి వద్ద ఉన్న మెట్లపై మాట్లాడుకుంటూ కూర్చున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు కారులో వస్తూ ఇంటి సమీపంలోకి రాగానే వేగాన్ని పెంచి కారును మెట్లపైకి ఎక్కించారు. 3 మెట్లు ఎక్కగానే కారు టైరు పగిలిపోయి ఆగింది. దీనికి అర గజం దూరంలో ఉన్న రామారావు దంపతులకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.



పచ్చదనమే..

సిరిసిల్ల: పల్లె పొలిమేరలు పసిడి పంటలు.. పచ్చదనంలో కనువిందు చేస్తున్నాయి. జిల్లాలో ఇటీవల సమృద్ధిగా వర్షాలు పడడంతో.. వరి నాట్లు పూర్తయ్యాయి. వరి పంటల పచ్చదనం పల్లవిస్తోంది. కోనరావుపేట మండలం బావుసాయిపేట–కొండాపూర్, వెంకట్రావుపేట గ్రామాల మధ్య పచ్చటి వరి పొలాలు అలరారుతున్నాయి. ఉచిత కరెంట్‌కు చిహ్నమైన విద్యుత్ స్తంభాలు.. పల్లెకు చేరిన సెల్ ఫోన్ టవర్.. సహజసిద్ధమైన గుట్టలు.. నీలి ఆకాశంలో మబ్బులతో పల్లెల్లో ప్రశాంతత కనువిందు చేస్తోంది.

కోడికి 3 కాళ్లు.. 7 వేళ్లు..



గంభీరావుపేట: కోళ్లకు సాధారణంగా 2 కాళ్లుంటాయి. మండల కేంద్రంలోని ఓ కోళ్ల ఫారంలో మాత్రం 3 కాళ్ల కోడి కనిపించడం ఆసక్తి రేపుతోంది. సాధారణంగా ఇలాంటి వైకల్యం అరుదుగా కనిపిస్తుంది. జన్యులోపమో.. ఇతర ఏ కారణమో తెలియదు గాని.. 3 కాళ్ల కోడిని చూసిన వారందరికీ ఆశ్చర్యమేస్తోంది. మండల కేంద్రానికి చెందిన తుమ్మనపల్లి రాజేశ్‌గాంధీకి చెందిన కోళ్ల ఫారంలో 3 కాళ్ల కోడి ఉంది. ఒక కాలుకు 7 వేళ్లుండడం మరో విశేషం.



ముస్తాబాద్: చీకోడు జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆట వస్తువులు విరిగిపోయాయి. ఊయలలు, జారుడు బండ వంటి ఆట వస్తువులు శిథిలమయ్యాయి. విద్యార్థులు విరిగిన ఆట వస్తువులతో ఇబ్బంది పడుతున్నారు. దాతలు సమకూర్చిన ఆట వస్తువులను మరమ్మతు చేసే వారు కరువయ్యారు. విద్యార్థులకు ప్రమాదం జరగకముందే బాగు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఉమారాణి, సీడీపీవో, సెల్ నం.: 9494868422

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626



అపూర్వ సమ్మేళనం

గంభీరావుపేట: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మన బాల్యం–మన మధుర స్మృతులు పేరిట ఒక్కచోట చేరారు. విద్యార్థిగా గడిపిన మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు.

కోట్లాది ప్రజల హృదయ స్పందనే హిందీ భాష



సత్యనారాయణగౌడ్‌కు సన్మానం

వేములవాడ: హిందీ భాషా దినోత్సవం సందర్భంగా హిందీ పండిట్ తీగల సత్యనారాయణగౌడ్‌ను గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, రేణుకా మాత గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గౌడ సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి లక్ష్మీనారాయణగౌడ్ మాట్లాడుతూ.. భారతదేశంలో అధిక సంఖ్యలో మాట్లాడే భాష హిందీ అని అన్నారు. గోపా పట్టణ అధ్యక్షుడు దూలం సంపత్ గౌడ్, కార్యదర్శి కైరి లింగయ్య, రేణుక మాత గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని ఎల్లాగౌడ్, విక్కుర్తి అంజయ్యగౌడ్, పులి రాంగోపాల్, బాలుసాని తిరుపతిగౌడ్, వేణు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారికి మాట్లాడే హక్కు లేదు



నివాళి అర్పిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: బీజేపీ మతోన్మాదులకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంపై మాట్లాడే హక్కు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోడం రమణ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో సాయుధ పోరాట యోధులు అమృతలాల్ శుక్ల, లక్ష్మీపూర్‌లో సింగిరెడ్డి భూపతిరెడ్డి స్తూపానికి ఆదివారం నివాళి అర్పించారు. జువ్వాజి విమల, సూరం పద్మ, సురేశ్, నర్సయ్య, శంకర్, గంగాధర్, శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

సిరిసిల్ల టౌన్: భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. శివనగర్‌లోని శివాలయం హాల్‌లో సోమవారం నిర్వహిస్తున్నామన్నారు.

గ్రామ దేవతలకు మొక్కులు



ఆలయంలో యూనియన్ నాయకులు

బోయినపల్లి: తడగొండ అన్నపూర్ణ ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ, దుర్గమ్మ తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవతల ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. వన భోజనాలు చేశారు. అధ్యక్షుడు రేండ్ల గంగరాజు, సభ్యులు పాల్గొన్నారు.



పందుల బెడద

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో పందుల బెడద ఎక్కువైంది. సిద్దిపేట రహదారిలో రత్నాల కుంట వద్ద, పోతుగల్ దారిలో పందులున్నాయి. చెత్త కుప్పల వద్ద వరాహాలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల సంతతి పెరగిందని, వాటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఒకవైపు పందులు, మరోవైపు కోతులతో బయట తిరిగే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.